అడుగుకో గుంత!


షాపూర్‌నగర్ ఆంధ్రాబ్యాంక్ గల్లీ వద్ద..


జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే రోడ్డు ప్రారంభంలో..

రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ పరిధిలో మౌలిక సదుపాయాలకల్పనకు ప్రతియేటా కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా రోడ్లు మాత్రం అధ్వాన్నంగానే దర్శనమిస్తున్నాయి.. కొత్త రోడ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేస్తున్నా శిథిలమైన పాత రోడ్లపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. కొన్ని రోడ్లలో అడుగుకో గుంత ఉండటంతో రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. గతుకుల రోడ్లపై వెళ్లే సమయంలో పక్కటెముకలు అదురుతున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో సుమారు 50 కిలోమీటర్ల మేర రోడ్లు విస్తరించి ఉన్నా చాటా మటుకు అంతర్గత రోడ్ల నిర్వహణను అధికారులు గాలి కొదిలేయడంతో గతుకులు, గుంతలు దర్శనమిస్తూ వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి.. అంతర్గత రోడ్ల దయనీయ స్థితిపై 'సాక్షి' ఫోకస్..

గాంధీనగర్–మారుతినగర్ రోడ్డు..

గాంధీనగర్ కమిటీ హాలు దాటిన తరువాత మారుతినగర్‌కు వెళ్లే మార్గంలో వంద మీటర్ల మేర రోడ్డు గతుకుల మయంగా మారింది. ముఖ్యంగా మారుతినగర్ కల్వర్ట్ సమీపంలో రోడ్డు కుంగిపోయింది. ఈ ప్రాంతంలో రంధ్రం ఏర్పడటంతో రాత్రివేళల్లో వాహనాలు అందులో ఇరుక్కుని గాయాల పాలవుతున్నారు. దీంతో స్థానికులు ప్రమాద సుచికగా కట్టెను ఏర్పాటు చేశారు.

షాపూర్‌నగర్ మార్కెట్‌లో..

షాపూర్‌నగర్‌లోని మార్కెట్‌లో ఇటీవల కొత్త రోడ్డు వేసిన అధికారులు దానికి ఆనుకుని ఉన్న అంతర్గత రోడ్లను మరిచారు. ముఖ్యంగా గాజులరామారం, జగద్గిరిగుట్ట నుండి షాపూర్‌నగర్‌కు వచ్చే వాహనదారులు షార్ట్ కట్‌గా ఆంధ్రబ్యాంక్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కాని ఈ రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు..

జీడిమెట్ల పారిశ్రామికవాడ ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు విషయం ఇక చెప్పనక్కర్లేదు. ప్రధాన రోడ్డు ప్రవేశంలోనే భారీ గుంత కనిపిస్తుంది. ఈ రోడ్డు మొదలుకుని దూలపల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డు మార్గంలో అనేక చోట్ల గుంతలు ఏర్పడంతో భారీ వాహనాలు తరచూ వాటిలో ఇరుక్కోవడంతో, వాటిని బయటకు తీయలేక వాహన డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.

సగం మేర రోడ్డుతో తిప్పలు..

సూర్యానగర్‌లోని యూనిక్ హైస్కూల్ రోడ్డు సగం మేర మట్టితో, మిగతా సగం కాంక్రీట్ రోడ్డుతో ఉండటంతో వర్షాకాలంలో బురదమయంగా, ఇతర కాలాల్లో దుమ్ము ధూళి రేగి సమీప ఇళ్లవాసులు, దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫర్లాంగ్ మేర ఒక వైపు సీసీ వేసి అధికారులు మిగతా సగంలో రోడ్డు వేయకుండా వదిలేశారు. సంవత్సరాలు గడుస్తున్నా మిగతా సగంలో రోడ్డు వేయడం లేదని, అటు ప్రజాప్రతినిదులు, ఇటు అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా స్పందన కరువైందని స్థానికులు వాపోతున్నారు.


గాంధీనగర్- మారుతినగర్ రోడ్డులో కల్వర్ట్ సమీపంలో కుంగిపోయిన రోడ్డు.. రంధ్రం పడిన చోట్ల హెచ్చరికగా కర్రను ఏర్పాటు చేసిన దృశ్యం..

కంకర తేలిన ఆదర్శనగర్ ప్రధాన రోడ్డు..

ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం మొదలుకుని పలు చోట్ల ప్రధాన రోడ్డులో కంకర తేలి గతుకుల మయంగా మారింది.దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే పక్కటెముకలు అదురుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కాలనీలోని మిగతా ప్రాంతాల్లో రోడ్డు వేసిన అధికారులు ప్రధాన రోడ్డులో కనీసం మరమ్మతులైనా చేసి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గతుకలు, అతుకులతో గిరినగర్ రోడ్డు..

గురుమూర్తినగర్ నుండి గిరినగర్ లోని పోచమ్మ ఆలయం వరకు ఉన్న రోడ్డు చాలా చోట్ల గతుకులు, అతుకుల మయంగా మారింది. పలు చోట్ల రోడ్ల గుంతలకు తోడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు సైతం ధ్వంసం కావడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇటీవల డ్రైనేజీ లైన్ వేసేందుకు కాంట్రాక్టర్ కొద్ది మేర రోడ్డు తవ్వడంతో సమస్య మరింత జఠిలంగా మారింది.

గుంతలతో మాణిక్యనగర్ రోడ్డు..

చింతల్ ప్రధాన రోడ్డు మొదలుకుని మాణిక్యనగర్ నాలా వరకు పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల పైపులైన్‌లు వేసేందుకు రోడ్డు మధ్యలో తవ్వి వదిలేయడంతో వాహనదారులు అటుగా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. పక్క గల్లీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ రోడ్డు ఎటువంటి గుంతలు లేకుండా సాఫీగా ఉండగా ఈ రోడ్డును ఇలా వదిలేశారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

సంజయ్‌గాంధీనగర్–జగద్గిరిగుట్ట రోడ్డు..

ఇక సంజయ్ గాంధీనగర్- జగద్గిరిగుట్ట రోడ్డు ప్రాంతం దిగువన ఉండటంతో వర్షాకాలంలో నీరు చేరి వాహనదారులకు నరక ప్రాయంగా మారుతోంది. ఈ ప్రాంతంలో రోడ్డు కొట్టుకుపోవడంతో పూర్తిగా గతుకల రోడ్డుగా మారింది. ఈ ప్రాంతంలో నీరు నిల్వకుండా అధికారుల డ్రెయిన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


సూర్యానగర్‌లోని యూనిక్ హైస్కూల్ రోడ్డు..


కంకర తేలిన ఆదర్శనగర్ ప్రధాన రోడ్డు


గుంతలు, గతుకుల మయంగా గిరినగర్ రోడ్డు


పలు చోట్ల ధ్వంసమైన మాణిక్యనగర్ రోడ్డు


సంజయ్‌గాంధీనగర్- జగద్గిరిగుట్ట రోడ్డు ధ్వంసమైన దృశ్యం

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం

దుండిగల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని, ప్రతి రోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఇఫ్ టెక్నాలజీ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కళాశాలలోని వివిధ విభాగాలు, క్రీడా సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రేయా రెడ్డి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా సెల్ టవర్ల ఏర్పాటు


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేత కీలుకాని లక్ష్మణ్..

కుత్బుల్లాపూర్: సెల్ టవర్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సెల్ టవర్ల ఏర్పాటును అడ్డుకోవాలని కోరుతూ గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో సోమవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సూరారం డివిజన్‌లోని సంజయ్‌గాంధీ నగర్, న్యూ షాపూర్‌నగర్, కళావతినగర్ ప్రాంతాల్లో 100 గజాల్లోనే ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు అంజయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను కాపాడండి


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నేత మల్లారెడ్డి

దుండిగల్: గండిమైసమ్మ దుండిగల్ మండలంలోని సీలింగ్ భూములను కాపాడాలని భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అడ్వకేట్ మహేందర్‌రెడ్డి, బిజెవైఎం అధ్యక్షుడు విజయ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



జీడిమెట్ల: లైఫ్‌స్పాన్ అస్పత్రి అధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. సోమవారం ఉదయం ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని ప్రశాంత వనం పార్కులో టీఎస్‌ఐఐసీ కాలనీకి లైఫ్‌స్పాన్ అస్పత్రి వైద్యుల అద్వర్యంలో ఉదయం నిర్వహించారు. డా.సుచరిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎర్రకుంటను కాపాడండి

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో వెలసిన అక్రమ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువుల స్థలాలలను అక్రమించి దర్జాగా బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా ప్రగతినగర్ పరిధిలో ఉన్న ఎర్రకుంట దర్జాగా కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎర్రకుంట రెండెకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కుంటలో సుమారు 2 వేల గజాలు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని అన్నారు.ఈ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు సైతం అనుమతులు ఇవ్వడం విచారకరమన్నారు.ఇప్పటికైన వెంటనే అధికారులు స్పందించి ఎర్రకుంటను కాపాడాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు..

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు, కాలనీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో రాజును కలిశారు. మర్యాపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి


సమస్యలపై వచ్చిన వారితో తహసీల్దార్ రహమాన్

సుభాష్‌నగర్: సోమవారం కుత్బుల్లాపూర్‌లోని మండల కార్యాలయానికి ప్రజలు వివిధ పనుల నిమిత్తం పెద్ద ఎత్తున వచ్చారు. ఇటీవల శాసన సభ ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండటంతో ప్రజల పనులు జరగలేదు. ఎన్నికల అనంతరం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది రావడంతో ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి వచ్చారు. తహసిల్దార్ రహమాన్ కార్యాలయం అవరణలో ఉన్న ప్రజల వద్దకు ఆయనే స్వయంగా వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

పైపులైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆదర్శనగర్, భగత్ సింగ్ నగర్ సెక్షన్లలో సెక్షన్ మేనేజర్లతో కలిసి పర్యటించారు. సెక్షన్ల పరిధిలోని బస్తీలు, కాలనీలలో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులు, జంక్షన్ వర్కులు, తాగునీటి నూతన పైపులైన్ల విస్తరణ పనితీరును పరిశీలించారు. బస్తీలలో నెలకొన్న తాగునీటి సరఫరాలో సమస్యలు, అదేవిధంగా మురుగునీటి సమస్యలపై వినియోగదారులను జీఎం శ్రీధర్ రెడ్డి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కబ్జాలను అరికట్టండి


ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలోని పలు ప్రభుత్వ స్థలాలు విచ్చలవిడిగా కబ్జా అవుతున్నాయి. వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ ఆఫీస్ ప్రజావాణిలో స్థానిక బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేసారు.

- ముఖ్యంగా కుత్బుల్లాపూర్ మండలానికి సంబంధించిన భూదేవి హిల్స్‌లోని ప్రభుత్వ భూమిని మూసాపేట్‌కు సంబంధించిన స్థలంగా చెప్పి ప్లాట్‌లను అమ్ముతూ పేద ప్రజలతో ఆడుకుంటున్నారని వారు విన్నవించారు.
- ఆర్‌జీకే, సంస్కృతి స్కూల్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఓ గదిని నిర్మించారు. మండల కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- 54 బ్లాక్ వద్ద రెండు గదులు నిర్మాణం పూర్తి చేసారని, వీరిపై తగిన చర్య తీసుకోవాలని వినతి పత్రంలో తెలియజేసారు.
- అలాగే రింగ్ బస్తీలో జయశంకర్ భవన్ సమీపంలో, శ్రీ కృష్ణ దేవాలయం సమీపంలో, బ్రహ్మంగారి గుడి సమీపంలో, కణ్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి గదుల నిర్మాణం చేపట్టి విక్రయించారు.


సూరారం ఉమామహేశ్వర కళ్యాణంలో ..

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అభిషేకాలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం లోని శ్రీ ఉమామహేశ్వర కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హంపి పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామీజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంగడిపేట్, సుభాష్ నగర్, పద్మా నగర్, జగద్గిరిగుట్ట శివాలయాల్లో రాత్రి వరకు మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


సూరారం లక్ష్మినగర్‌లో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: 11 కెవి ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. కెవి రామరాజునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కెవి జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని గ్రీన్ పార్క్ ఏరియా, ప్రధాన రహదారి, పిస్తా హౌజ్ ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

16న సెమీ క్రిస్మస్ వేడుకలు

నిజాంపేట్: బాచుపల్లిలోని సాయినగర్‌లోని బేతనియ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 16న సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ సైమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈనెల 16న నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా పాస్టర్ జాన్ పాల్ ,బేతనియ వ్యవస్థాపకులు పాస్టర్ నెహెమ్యాలు పాల్గొంటారని తెలిపారు.స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేసీఆర్‌కు పరామర్శ



కుత్బుల్లాపూర్: సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పరామర్శించారు.

14న శ్రీమద్భగవద్గీతా కంఠస్థ పోటీలు

కుత్బుల్లాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 14వ తేదిన శ్రీమద్భగవద్గీతా కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 6, 7, 8, 9వ తరగతి విద్యార్థులకు రెండు విభాగాలుగా 3వ అధ్యాయము కర్మయోగము(30 శ్లోకాల వరకు), 18 సంవత్సరాల లోపు, పైబడిన వారు రెండు విభాగాలుగా సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నారు. నాలుగు విభాగాల్లోని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామని, ఈ పోటీలను మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈ నెల 14వ తేదిన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని, ఇతర వివరాలకు 9030000964, 9030850336లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కుత్బుల్లాపూర్: తనపై నమ్మకంతో హ్యాట్రిక్‌గా గెలిపించిన ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. మూడవ సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన వివేకానంద్‌ను బిఆర్ఎస్ నేతలు, సంక్షేమ సంఘాల నేతలు, ప్రజలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రియాజ్, వైస్ ప్రెసిడెంట్ బాలు నేత, నందానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కార్తిక్‌గౌడ్, సాముల బ్రహ్మం, రాజశేఖర్, తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఆలీ తలాబ్ సమస్యకు పరిష్కారం


సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీ తలాబ్ చెరువు అలుగు నుంచి నీరు బయటకు వెలువడుతుందన్న సమాచారం తెలియడంతో సోమవారం ఇరిగేషన్ అధికారులతో స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జేసీబీ సహాయంతో మరమ్మతులు చేయించామన్నారు. నీటి ప్రవాహం ద్వారా చెరువు దిగువన గల కాలనీలు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ రతన్‌నాయక్, నాయకులు కుమారస్వామి, మాధవ్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు



విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న సత్‌జ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం

కుత్బుల్లాపూర్: తమ పాఠశాలలో విద్యార్థులకు చదువులతో పాటు క్రీడల్లో సమ ప్రాదాన్యత కల్పిస్తున్నామని సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అన్నారు. వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో విద్యార్థులకు కుంగ్‌ఫు బెల్ట్ టెస్ట్ నిర్వహించగా ప్రతిభ కనబర్చిన 100 మంది విద్యార్థులకు మల్లేశం బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కుంగ్‌ఫూ నేర్చుకోవాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వాయుపుత్ర స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ పాముల వినోద్ కుమార్, మాస్టర్ రమేష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.